ప్రజాశక్తి

బుధవారం 19 ఏప్రిల్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆదర్శనీయుడు మళ్ల సత్యనారాయణ

- సంస్మరణ సభలో వక్తలు
- అశ్రునయనాల నడుమ అంతిమయాత్ర
- ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, విలేకరి

జీవితాంతం కార్మిక, కర్షకుల కోసం పోరాటాలు నడిపిన మళ్ల సత్యనారాయణ అందరికీ ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం అనకాపల్లిలో కన్నుమూసిన సిపిఎం సీనియర్ నాయకులు మళ్ల సత్యనారాయణ అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ మంగళవారం సాగాయి. వందలాది మంది తరలివచ్చి నివాళ్లర్పించారు.



మళ్ల సత్యనారాయణ పార్థివదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు

తొలుత పూడిమడక రోడ్‌లోని మళ్ల సత్యనారాయణ స్వగృహం వద్ద సిపిఎం అనకాపల్లి మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ అధ్యక్షతన సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వెంకటసత్యవతి మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం పనిచేసి అందరి మన్ననలూ సత్యనారాయణ పొందారని కొనియాడారు. ప్రజల బాగోగుల కోసం పరితపించిన వ్యక్తి మృతిచెందడం తననెంతగానో బాధించిందన్నారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ విద్యార్థి సంఘం నుంచీ తుది శ్వాస విడిచే వరకూ అనేక పోరాటాలను మళ్ల సత్యనారాయణ నిర్వహించారని అన్నారు. సిపిఎం అభివృద్ధిలోనూ, కార్మిక సంఘాలు ఏర్పాటు చేయడంలోనూ మిగతా 2లో..



కుటుంబీకులను ఓదారుస్తున్న సిహెచ్.నర్సింగరావు

విద్యుత్ వినియోగదారులకు విస్తృత సేవలు

- దేశంలోనే ఉత్తమ డిస్కంగా నిలిపేందుకు కృషి
- ఇపిడిసిఎల్ నూతన సిఎమ్‌డి పృథ్వీతేజ్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి అన్నారు. మంగళవారం ఉదయం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సిఎమ్‌డిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే ఇపిడిసిఎల్‌కు ఉత్తమ డిస్కామ్‌గా గుర్తింపు లభించేలా పనిచేస్తానన్నారు. ఆర్‌డిఎస్‌ఎస్, జగనన్న హౌసింగ్ కాలనీ విద్యుద్ధీకరణ, వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు విద్యుత్ సరఫరా, అంతరాయం లేకుండా 24 గంటలూ అన్నిచోట్లా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. 33 కెవి, 11 కెవి ట్రిప్పింగ్‌లను తగ్గించేందుకు, వినియోగదారునికి సంస్థ సేవలు చేరువచేసే ప్రభుత్వ పథకాల అమలుకు పటిష్టమైన చర్యలు చేపడతానన్నారు. ఇందుకు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల సహకారం తీసుకుంటానన్నారు. మరమ్మతు, నిర్వహణ ఖర్చులు, సరఫరా నష్టాలు తగ్గించడం, సబ్ స్టేషన్ ఆటోమేషన్‌కు గ్లోబల్ సాంకేతికత వినియోగం పెంచడం, కృత్రిమ మేధస్సుపై ప్రత్యేక శ్రద్ధ చూపడంపై దృష్టిసారిస్తానన్నారు. పృథ్వీతేజ్‌కు ఇపిడిసిఎల్ నుంచి ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డిగా బదిలీపై వెళ్తున్న కె.సంతోషరావుతో పాటు సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఎవివి.సూర్యప్రతాప్, రాధికా అనుసూరి, పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న పృథ్వీతేజ్

21న జాబ్ మేళా

వార్త 4లో..

'ఆకాశవాణి' ఆకిరి రామకృష్ణారావు మృతి

వార్త మెయిన్‌లో..

మతోన్మాద బిజెపిని గద్దె దింపడమే లక్ష్యం

వార్త 8లో..

బాలి మృతితో నగరంలో విషాదఛాయలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రముఖ రేఖ, వ్యంగ్య చిత్రకారుడు బాలి (78) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారన్న వార్తతో విశాఖ నగరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన ప్రస్థానాన్ని, బొమ్మలను పలువురు గుర్తు చేసుకున్నారు. కొంతకాలంగా అస్వస్థతగా ఉన్న బాలి నగరంలోని ఎంవిపి కాలనీ సెక్టార్ 9లో ఉన్న తన గృహంలో కన్నుమూశారు. ఆ సమయంలో అతని కుమార్తె వైశాలి అక్కడే ఉన్నారు. సాయంత్రం బాలి అంత్యక్రియలు ఎంవిపి కాలనీలోని శ్మశాన వాటికలో జరిగాయి. బాలి మరణించిన సంగతి తెలియడంతో అనేకమంది ప్రముఖులు ఎంవిపి కాలనీకి వెళ్లి బాలి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాలి జన్మస్థలం అనకాపల్లి. 1945 ఆగస్టు 16న జన్మించిన బాలి అసలు పేరు మేడిశెట్టి శంకరరావు. తండ్రికి చిత్రకళపై ఉన్న ఆసక్తి బాలిలో చిన్నప్పటి నుంచి కలిగింది. చిత్రకళపై మక్కువ పెంచుకొని చదువుకుంటున్న రోజుల్లోనే పలు కార్టూన్లు గీసి, అప్పటి ఆంధ్రజ్యోతి వార పత్రిక, యువ, జ్యోతి మాస పత్రికలకు పంపడం, అవి మిగతా 2లో..

నిప్పులు చెరిగిన భానుడు

- మండుటెండతో విలవిల్లాడిన జనం
- విశాఖలో 44 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

భానుడి ప్రతాపంతో జనం విలవిలలాడుతున్నారు. మండుటెండలతో గడచిన కొద్దిరోజులుగా నానా అవస్థలు తప్పడం లేదు. ఇంట్లోంచి కాలు బయటకు మోపాలంటే వణికే పరిస్థితులు నెలకొన్నాయి. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడమే ఇందుకు కారణంగా ఉంది. మంగళవారం విపరీతమైన వేడిమితో విశాఖ నగరంలో జనం అల్లాడిపోవడం కనిపించింది. పలు చోట్ల 44 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 43 డిగ్రీల ఉష్ణోగ్రతలే అత్యల్పంగా ఉన్నాయి. విశాఖ జిల్లా ఆనందపురం మండలం గంభీరం వద్ద 43.86 డిగ్రీలు నమోదు కాగా అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 44.01 డిగ్రీలు, ఇదే జిల్లా కోటవురట్ల మండలం కైలాసపురంలో 44.44 డిగ్రీలు నమోదైంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల 45 డిగ్రీలు అత్యధికంగా, 43 డిగ్రీలు అత్యల్పంగా నమోదయ్యాయి. విజయనగరం జిల్లా రాజాంలో 45 డిగ్రీలు, పూసపాటిరేగ మండలం



మండుటెండలోనే వ్యాపారాలు సాగిస్తున్న మహిళలు

అల్లాడపాలెంలో 44.03 డిగ్రీలు నమోదైంది. శ్రీకాకుళం జిల్లా బూర్జ వద్ద కొల్లువలసలో 44.8 డిగ్రీలు నమోదైంది. రాష్ట్రంలో పలుచోట్ల ఇదే రకమైన ఉష్ణోగ్రతలు కొనసాగాయి. భారత వాతావరణ సంస్థ (ఐఎండి) కూడా మంగళవారం హెచ్చరికలు జారీచేసింది. అందులో విశాఖ, విజయనగరం, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాలు కూడా ఉన్నాయి. వేడిగాల్పులు ఉంటాయని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

వడగాల్పులతో భయాందోళన

ఉదయం 8 గంటల మిగతా 2లో..

మ్యుటేషన్ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భూముల లావాదేవీలు జరిగినప్పుడు వెబ్ ల్యాండ్‌లో ఎప్పటికప్పుడు మ్యుటేషన్ పనులు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహశీల్దారులు, రెవిన్యూ అధికారులు, విఆర్‌ఒలతో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలిసి రెవిన్యూ శాఖ పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీసేవ, ఏపీ సేవ, స్పందన ద్వారా ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులపై సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆదర్శనీయుడు మళ్ల సత్యనారాయణ


మాట్లాడుతున్న జగ్గునాయుడు



అనకాపల్లి ఎంపీ సత్యవతి

ఎంతో కీలకంగా వ్యవహరించారన్నారు. కుటుంబ సభ్యులను కూడా పార్టీకి సన్నిహితంగా ఉండేలా చేసిన మంచి కమ్యూనిస్టు అని కొనియాడారు. ఆరేళ్లనుంచీ ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహించిన సేవాతత్పరుడన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో వర్తక, కార్మిక సంఘాలు ఏర్పాటు చేయడంలో సత్యనారాయణ విశేష కృషి చేశారని అన్నారు. పట్టణంలోని వివిధ తరగతులకు సేవలందించారని గుర్తు చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలు నిర్వహించడం, కష్ట జీవులు, కార్మికుల ప్రయోజనాల కోసం పనిచేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణరావు (పెదబాబు) మాట్లాడుతూ వర్తక సంఘ అభివృద్ధిలోనూ, నల్లబెల్లం ఉద్యమంలోనూ ఆయన నిర్వహించిన పాత్ర మరువలేనిదన్నారు. ఎఎంఎఎల్ కళాశాల కరస్పాండెంట్‌గా, ఎఎంఎఎ ఉన్నత పాఠశాల అధ్యక్షునిగా అంకిత భావంతో సేవలందించారన్నారు. అనకాపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు వడ్డీవ్యాపారుల బారిన పడకుండా అడ్వాన్సులు కార్మికులకు ఇప్పించారన్నారు. కౌన్సిలర్‌గా అటు ప్రజా సమస్యలను, ఇటు కార్మిక సమస్యలను ప్రస్తావించి పరిష్కారమయ్యేలా చూసేవారన్నారు. సిపిఐ అనకాపల్లి పట్టణ కన్వీనర్ వైఎన్ భద్రం మాట్లాడుతూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి పన్నుల పెంపుదలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. డావిన్సీ స్కూలు కరస్పాండెంట్ కర్రి సుందరయ్య మాట్లాడుతూ విద్యార్థి, యువజన ఉద్యమాల్లో పనిచేయడానికి తననెంతో ప్రోత్సహించారన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస విడిచేవరకూ పనిచేసిన ఉద్యమశీలి అని కొనియాడారు. సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక, వర్తక కళాసీ సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి పనిచేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు.

అశ్రునయనాలతో అంతిమ యాత్ర

మళ్ల సత్యనారాయణ అంతిమ యాత్ర పార్టీ శ్రేణులు, కార్మికులు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య సాగింది. పూడిమడక రోడ్‌లోని సత్యనారాయణ ఇంటి నుంచి ప్రారంభమైన అంతిమ యాత్ర కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న దొడ్డి రామునాయుడు కార్మిక, కర్షక నిలయానికి చేరుకుంది. కొద్దిసేపు ఆయన పార్థివ దేహాన్ని అక్కడ కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు అయోధ్య రామ్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గునాయుడు పార్టీ జెండాను ఆయన పార్థివ దేహంపై ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంతియ యాత్ర నెహ్రూ చౌక్ జంక్షన్ మీదుగా మున్సిపల్ స్టేడియం, మెయిన్‌రోడ్, చిననాలుగు రోడ్ల జంక్షన్, వన్‌వే ట్రాఫిక్ పార్క్ సెంటర్ మీదుగా గవరపాలెం సంతబయలు శ్మశాన వాటికకు చేరింది.

ఘన నివాళి

సత్యనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన వారిలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఆర్.రాము, వివి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, డి.వెంకన్న, రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, గండి నాయనబాబు, ఆళ్ల మహేశ్వరరావు, సదాశివరావు, రంగారావు, మాజీ కౌన్సిలర్ బొడ్డేడ అప్పారావు, గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొడ్డేడ ప్రసాదరావు, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు జాజుల రమేష్, ఎన్‌టిఆర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ జగన్మోహన్‌రావు, విక్రమ్ డాక్టర్ సత్యనారాయణ, కాంద్రేగుల నూకరాజు, ఉషోదయ రమణాజీ, కాంగ్రెస్ నాయకులు ఐఆర్ గంగాధర్, వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్, కర్రి సన్యాసినాయుడు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి, సిఐటియు నాయకులు దాకారపు శ్రీనివాసరావు, బూర్ల గోవిందరావు, దాకారపు వరలక్ష్మి, జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు భీశెట్టి అప్పారావు, బైపాస్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు మందా రాము, భవాని, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు ఉన్నారు. ఏపి వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బాలు గాడి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

మళ్ల కుటుంబానికి నర్సింగరావు పరామర్శ

మళ్ల సత్యనారాయణ కుటుంబ సభ్యులను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పరామర్శించారు. ఆయన సత్యనారాయణ ఇంటికెళ్లి భార్య సరోజిని, కుమారులు డాక్టర్ జగదీశ్, సుందర వాసులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

నిప్పులు చెరిగిన భానుడు

నుంచే భానుడి ప్రతాపం మంగళవారం కనిపించింది. రోడ్లపై జనం తిరిగాడే పరిస్థితి బాగా తగ్గుముఖం పట్టింది. వృద్ధులు, చిన్నపిల్లలు రహదారులపై కనిపించలేదు. వడగాలుల ప్రభావంతో ఇంటికే పరిమితమైపోయారు. దేశంలోని ఎడారి ప్రాంతం నుంచి గాలుల దిశ ఈ ఎండాకాలంలో భూమిపైకి వస్తున్నందున ఈ పరిస్థితి కొనసాగుతోందని, దక్షిణ గాలులు వచ్చే వరకూ వేడిమి తగ్గే అవకాశాలుండవని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరో మూడు రోజుల వరకూ వేడి గాలుల ప్రభావం ఉంటుందని తెలిపారు.

బాలి మృతితో నగరంలో విషాదఛాయలు

ప్రచురణ కావడంతో చిత్రకళపై మరింత మక్కువ పెంచుకున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించి, ఇరిగేషన్ శాఖలో క్లర్క్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. ఉద్యోగిగా ఉంటూనే కార్టూన్లు గీస్తూ, పత్రికలకు పంపేవారు. 1974లో విశాఖలో ఈనాడు ప్రాంతీయ దినపత్రిక ప్రారంభమైంది. అప్పటి ఆ పత్రిక ఎడిటర్ ఎబికె.ప్రసాద్ అభ్యర్థన మేరకు ఈనాడులో స్టాఫ్ ఆర్టిస్టుగా, కార్టూనిస్టుగా చేరారు. ఏడాది కాలంలోనే ఈనాడు నుంచి బయటికి వచ్చారు. ప్రారంభంలో శంకరరావు పేరుతో కార్టూన్లు వేసిన బాలి ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లి ఆంధ్రజ్యోతిలో స్టాఫ్ ఆర్టిస్ట్‌గా చేరారు. అప్పటి సీనియర్ జర్నలిస్ట్ పురాణం సుబ్రహ్మణ్యం సూచన మేరకు శంకరరావు పేరుకు బదులు బాలి పేరుతో కార్టూన్ వేయడం ప్రారంభించారు. కార్టూన్ బొమ్మలు గీయటం గొప్ప కాదు, దానిలో ఫన్ పేల్చటంలోనే కష్టం ఉంటుందని బాలి చెబుతుండేవారు. కార్టూన్ చిత్రాలతో 8 పుస్తకాలు రాశారు. జోక్స్‌పై సంకలనమే ఇచ్చారు. కథా రచనలలో కూడా బాలికి ప్రవేశం ఉంది 35 వరకు కథలు రాశారు. బాలి భార్య ధనలక్ష్మి 2010లో మరణించారు. ఆయనకు ఒక కుమారుడు గోకుల్, వైశాలి ఉండేవారు. వీరిద్దరూ ఉన్నత చదువులు చదువుకొని అమెరికాలో స్థిరపడ్డారు. అయితే ఇటీవల గోకుల్ అమెరికాలోని ఒక ప్రమాదంలో మరణించాడు. ఎంవిపి కాలనీలో ఉంటున్న బాలికి ఆరోగ్యం బాగా లేని కారణంగా ఆయన కుమార్తె వైశాలి ఇక్కడే ఉంటూ తండ్రికి సేవలు చేస్తున్నారు. బాలికి ప్రముఖులతో, మంచి పరిచయాలు ఉన్నాయి.

మ్యుటేషన్ పనులు వేగవంతం చేయాలి

చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎపిఐఐసి, ఎన్‌హెచ్ 16, రైల్వేస్ భూములకు సంబంధించి మ్యుటేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

కలిసికట్టుగా నగరాభివృద్ధికి కృషిచేద్దాం

జివిఎంసి కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులతో కమిషనర్


కమిషనర్‌ను కలిసిన జివిఎంసి కాంట్రాక్టు అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మంగళవారం ఉదయం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ సాయికాంత్ వర్మను జివిఎంసి కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ సభ్యులతో మాట్లాడుతూ అందరం కలిసి నగర అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ఆర్థిక పరిస్థితులను చూసుకొని బిల్లులను కూడా వెంట వెంటనే రిలీజ్ చేస్తామని చెప్పారు. అందుకు సభ్యులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు వీరారెడ్డి, కన్వీనర్ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి సాదురావు, ఉపాధ్యక్షులు రామనాయుడు, సహాయ కార్యదర్శి రమేష్, కోశాధికారి నర్సింగరావు, సలహాదారులు షిరిడి శ్రీనివాసరావు సభ్యులు ఆర్ఎ.నాయుడు, రాజాన రాంబాబు, బిఎ.రాము, గజపతిరాజు, చైతన్య ప్రసాద్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లించాలని, ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర డిమాండ్లను పరిష్కరించే వరకు రాష్ట్రవ్యాప్తంగా తాము చేపట్టిన పోరాటాన్ని ఆపేది లేదని ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి అన్నారు. జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌జిఒ హోం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ పిఆర్‌సి ప్రతిపాదించిన స్కేల్స్ బయట పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎల బకాయిలు, పిఆర్‌సి బకాయిలు చెల్లించాలన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -మధురవాడ : పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. జివిఎంసి 31వ వార్డు పరిధి ఎంఎస్ఎఫ్-4, బీచ్‌రోడ్‌లోని జివిఎంసి స్విమ్మింగ్ పూల్, వైఎస్ఆర్ వ్యూ పాయింట్ (సీతకొండ), కాపులుప్పాడ డంపింగ్ యార్డు తదితర ప్రాంతాలలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో వ్యర్థాలు అక్కడక్కడా కనిపిస్తున్నాయని, ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల ఫేస్ మస్టర్ విధానాన్ని పరిశీలించారు.

ఎంఎస్ఎఫ్-4ను సందర్శించి వ్యర్థాలు ఎన్ని టన్నులు వస్తున్నాయి... ఎన్ని టన్నులు కాపులుప్పాడకు తరలిస్తున్నారు... మిషనరీ పనిచేసే విధానాన్ని అడిగి తెలుసు కున్నారు. తదుపరి ఆర్‌కె.బీచ్‌రోడ్డులో ఉన్న జివిఎంసి స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించి పనులు వేగవంతం చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వైఎస్ఆర్ వ్యూ పోయింట్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులపై కొన్ని సూచనలు చేశారు. అనంతరం కాపులుప్పాడ డంపింగ్ యార్డును సందర్శించి బయోమైనింగ్ పనులను పరిశీలించారు. అవసరమైతే మరో యూనిట్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, కనకమహాలక్ష్మి, విజయలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీర్లు శ్యాంసన్‌రాజు, ఎఎంఒహెచ్ డాక్టర్ ఎన్.కిషోర్, సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ



బయోమైనింగ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ ఖైదీ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారానికి చెందిన రిమాండ్ ఖైదీ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాడేరుకు చెందిన కొర్ర వెంకట రమణ (35) ఈ నెల 6న సారా కేసులో పట్టుబడి విశాఖ కేంద్రకారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. శనివారం అర్ధరాత్రి తీవ్ర మైన జ్వరం రావడంతో కేంద్రకారాగారం సిబ్బంది కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు కారాగారం అధికారులు వెల్లడించారు.

కొట్లాటే మృతికి కారణమా?

రిమాండ్ ఖైదీ వెంకటరమణ మృతికి అనారోగ్యంతో ఒక కారణమైతే, కొట్లాటలో ఆయనకు తగిలిన గాయాలే కారణం కావచ్చని సమాచారం. 10 రోజుల క్రితం కేంద్రకారాగారంలో వెంకటరమణకు మరో ఖైదీకి మధ్య కొట్లాట జరిగింది. కొట్లాటలో వెంకటరమణ కంటితో పాటు మరికొన్ని భాగాలకు అంతర్గతంగా దెబ్బలు తగిలినట్టు సమాచారం. తీవ్ర గాయాలైన వెంకటరమణను మొదటి కెజిహెచ్‌కు తరలించారు. కంటికి తీవ్ర గాయం కావడంతో విశాఖ కంటి ఆసుపత్రి, ఎల్‌వి.ప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స అందించినట్టు సమాచారం. కంటికి, మరికొన్ని భాగాలకు అంతర్గతంగా తీవ్ర గాయాల కారణంగానే చికిత్స పొందుతూ మృతి చెంది ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రాంబాబు

తాగునీటి సమస్యపై దృష్టి

ప్రజాశక్తి-పద్మనాభం : వేసవి నేపథ్యంలో మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపిపి కె.రాంబాబు తెలిపారు. దీనిపై మంగళవారం సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ కార్యదర్శులతో ఎంపిడిఒ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదని, అవసరమైతే ప్రత్యేక నిధులు సమకూరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గీతం కెమిస్ట్రీ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం విద్యార్థులు ప్రాంగణ నియామకాలలో సత్తాచాటారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం నుంచి ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ కోర్సులు అభ్యసిస్తున్న దాదాపు 120 మంది విద్యార్థులకు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగఅవకాశాలు లభించడం విశేషం. ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ప్రొఫెసర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ విద్యార్థులకు హెటిరో ల్యాబ్స్, జివికె బయో, ఎమ్ఎస్ఎన్‌ల్యాబ్స్, బైజూస్ సంస్థలు భారీ వేతనంతో ఎంపిక చేసుకున్నాయని వెల్లడించారు. ఔషధ పరిశ్రమలలో క్వాలిటీ ఎనలిస్ట్, క్వాలిటీ కంట్రోలర్ వంటి ఉద్యోగాలు లభించగా ఆన్‌లైన్ విద్యను బోధించే బైజూస్ వంటి సంస్థ రూ.10 లక్షల వార్షిక వేతనంతో పలువురు విద్యార్థులకు ఉద్యోగాలు అందించిందని తెలిపారు. విభాగం పరిశోధక విద్యార్థిని సాయి సోనాలి అనంత ప్రతిష్ఠాత్మక స్టెమ్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.శ్రీకృష్ణ, ఇంచార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి అభినందించారు.

ఐఎన్‌టిఎస్ఒలో శ్రీ చైతన్య విజయభేరి

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ సంస్థ ఇటీవల నిర్వహించిన ద్వితీయ స్థాయి పరీక్షల్లో మధురవాడ బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు 397 మంది ప్రతిభను చాటారని ప్రిన్సిపల్ సందీప్ తెలిపారు. వీరిలో 120 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, మిగిలిన వారు కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారని చెప్పారు. మొదటి బహుమతి సాధించిన డి.వైష్ణవి, జె.నిక్షితలకు ట్యాబ్స్, ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థికి స్మార్ట్ వాచ్, నాలుగో బహుమతి సాధించిన విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, ఐదవ బహుమతి సాధించిన విద్యార్థికి హెడ్ సెట్స్‌ను ముఖ్యఅతిథి అహ్మద్ అలీ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం సురేష్, రాజేష్, శైలజ, ఉమామహేశ్వరరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పూల మార్కెట్ సమీపంలో ఉన్న మక్కా మసీద్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇఫ్తార్ విందుకు హాజరై మాట్లాడారు. ముస్లిం సోదర సోదరీమణులు అత్యంత నిష్ఠ, నియమాలతో ఆచరించే పండుగ రంజాన్ అన్నారు. విందుకు ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఫారూఖ్, అబ్దుల్ రహమాన్, ఎస్‌కె.అస్లీమ్, షేక్‌మస్తాన్, కోరాడ వెంకటరావు, బంక సత్యం, కాకర వెంకటరమణ, పి.వెంకటరమణ, పాండ్రంకి శ్రీను, బొట్ట ధనలక్ష్మి, రామకృష్ణ, ముస్లిం నాయకులు షేక్ మున్న షేక్ షబీనా, షేక్ బ్రాహన్, షేక్ మదీనా, ముస్తఫా, మస్తాన్,షేక్ రహీం హసీం రజ్వీ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ మంగమ్మ

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి నూతన కమిషనర్ సాయికాంత్ వర్మను 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ మున్సిపల్ ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వార్డులో తాగునీరు, వీధిదీపాలు, కాలువలు, రహదారులు, పార్కులు అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ కోరారు. ప్రధానంగా వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. వాంబే కాలనీలో భూగర్భ డ్రెయినేజీ పూర్తిగా దెబ్బతిందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

చందనోత్సవ టికెట్ల అమ్మకాలు ప్రారంభం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న చందనోత్సవం కోసం రూ.300, రూ.1000 టికెట్ల అమ్మకాలను మంగళవారం సింహాచలం స్టేట్‌బ్యాంక్, యూనియన్ బ్యాంకుల్లో ప్రారంభించారు.

పాస్టర్ల సమస్యలపై తహశీల్దార్‌కు వినతి



వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -ఆనందపురం : సమస్యలపై స్థానిక తహశీల్దార్ రామారావుకు మంగళవారం పాస్టర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్ల సంఘం అధ్యక్షులు ఆర్.ప్రభుదాస్ మాట్లాడుతూ, మండలంలోని పలు పంచాయతీలలో క్రైస్తవులకు శ్మశానవాటిక లేదని, వెంటనే ఏర్పాటుచేయాలని కోరారు. మండల కేంద్రంలో కమ్యూనిటీ హాలు ఇప్పించాలన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న జాయింట్ కలెక్టర్‌కు కూడా సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ అడ్వైజర్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జంగం జోషి మాట్లాడుతూ, గతంలో ఒక ఎకరం భూమిని శ్మశానవాటిక కోసం కుశలవాడ గ్రామంలో కేటాయించారని, అది దూరాభారం కావడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అప్పటి తహశీల్దార్ అంబేద్కర్ వేరే చోట ఇస్తామని చెప్పారని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కేటాయింపు జరగలేదని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల కార్యదర్శి వి.ఆనందరావు, పి.హనోకు, ఎస్.పాల్ తదితరులు పాల్గొన్నారు

చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : మండలంలోని బోయపాలెం జంక్షన్లో ఆటోస్టాండ్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ ప్రారంభించారు. సుమారు 1000 మంది పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ, ఈ సంవత్సరం వేసవితాపం చాలా ఎక్కువగా ఉంటుందని, ప్రజలు బయట తిరిగేటప్పుడు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఇలాంటి చలివేంద్రాలను వీలైనంత ఎక్కువగా మండలంలో ఏర్పాటుచేసి దాహార్తిని తీర్చాలని కోరారు. వేసవి తీవ్రత నేపథ్యంలో చెట్ల దగ్గర నీరు పెట్టి పక్షి సంపదను కాపాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, బోయపాలెం ఆటోస్టాండ్ ప్రెసిడెంట్ చిట్టిబాబు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పిఎం పాలెం : 5వ వార్డు పరిధి సాయిరాంకాలనీ శ్రీకృష్ణ భజన మండలి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు ప్రారంభించి కాలనీవాసులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయిరాం కాలనీ పెద్దలు ఆవాల నీలయ్య, జగన్నాథం, బొట్ట కోటి, జోగా సూర్య, ఆవాల లక్ష్మణ, బొడ్డేపల్లి రంగ, కర్రి సన్యాసిరావు, కాలనీ మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రంలోక మజ్జిగ పంపిణీ చేస్తున్న లక్ష్మణరావు తదితరులు

చందనోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానానికి చందనోత్సవం రోజున వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఏర్పాట్లను ఇఇ వి.త్రినాథరావు మంగళవారం పరిశీలించారు. క్యూలైన్లలో భక్తులకు నిరంతరం తాగు నీరు అందేందుకు గంగాధర నీటిని పరిశీలించారు. క్యూలైన్లను పర్యవేక్షించారు. భక్తులకు నిడనందించేలా పెండాల ఏర్పాట్లను పరిశీలించారు భక్తులు నడిచే మార్గంలో చల్లదనం ఇచ్చేందుకు కూల్ రూమ్ పెయింట్‌ను వేయించారు.



జీవికి కేక్ తినిపిస్తున్న ఎంపీ ఎంవివి.సత్యనారాయణ

జీవీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జివి) జన్మదిన వేడుకలు తన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవికి విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, సిఎంఆర్ షాపింగ్ మాల్స్ అధినేత మావురు వెంకటరమణ, కంకటాల అధినేత మల్లికార్జున, హనీ గ్రూప్ అధినేత ఒబులిరెడ్డి, ఆళ్ల శివగణేష్, సంస్థ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. తన పుట్టినరోజు వేడుకలకు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ జీవీ కృతజ్ఞతలు తెలిపారు.

21న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖపట్నంలోని పలు సంస్థలలో వివిధ పోస్టుల భర్తీకి కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 21న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి, కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. అరబిందో ఫార్మా, దక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మా, సన్సుప్రీమ్ ఆగ్రో సర్వీసెస్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు, ఎస్‌బిఐ కార్డ్స్, దిదేవరేజ్ ప్రోవిన్స్, జయభేరి ఆటోమొబైల్స్, సుగుణ ఫుడ్స్, హనీ గ్రూప్, 2050 హెల్త్ కేర్, హెల్త్ ఆన్ సంస్థలలో పోస్టుల భర్తీకి జాబ్ మేళా ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ, డిప్లమో, బి ఫార్మసీ, డి ఫార్మసీ, డిప్లమో మెకానికల్, బీటెక్ మెకానికల్, ఐటిఐ మోటార్ మెకానిక్, బీఎస్సీ నర్సింగ్, జిఎన్ఎమ్ నర్సింగ్, విద్యా అర్హతలు గల అభ్యర్థులు 18 నుంచి 40 మధ్య వయస్సు గలవారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు జీతాలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని అర్హతల గల ధ్రువపత్రాలతో ఆ రోజు హాజరు కావాలని కోరారు.

పౌర గ్రంథాలయంలో స్వర సంగమం

ప్రజాశక్తి-సీతమ్మధార : శారద స్వర సంగమం ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం కరోకే ట్రాక్ సాంగ్స్ నిర్వహించారు. లెఫ్టినెంట్ లోకేష్ నిర్వహణలో తెలుగు, హిందీ గీతాలు ఆలపించారు. కార్యక్రమాన్ని కళారంగ ప్రముఖులు కొణతాల రాజు, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్ట్ ఆర్టిస్ట్ డైరెక్టర్ సన్‌మూర్తి పలువురు గాయనీగాయకులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'అందాల ఆడబొమ్మ, 'కహోనా ప్యార్ హై'... పాపా కహతే హై బడా నామ్ కరేగా..., గిచ్చి గిచ్చి చంపమాకు హాయ్‌రా... అంటూ వివిధ చిత్రాలలో గీతాలను గాయకులు ఆలపించారు. పద్మిని, లోకేష్, వి.రామ్‌కుమార్, శారద, లత, నాయుడు, లక్ష్మి, స్వరూప, ధనలక్ష్మి, సాత్విక, రవిచంద్ర, గీత, లక్ష్మీస్వరూప, కవిత, వెంకటేష్ తదితర గాయకులు గీతాలను వినిపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ లక్ష్మణరావు, పణిస్వామి తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.

డాక్‌యార్డు రహదారిలో ట్రాఫిక్ జామ్

- వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి- ములగాడ : డాక్‌యార్డు గొడౌన్ రహదారిలో రైల్వే ట్రాక్ వద్ద బస్సు ఆగిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారి వైపు వస్తున్న వాహనదారులు ఇబ్బందులు గురయ్యారు. విషయం తెలుసుకున్న మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.



డాక్‌యార్డు గొడౌన్స్ వద్ద ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు

రేపటి ధర్నాను జయప్రదంచేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ కార్మికులకు తక్షణం నూతన వేతనాలు అమలుచేయాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, ప్రయివేటీకరణ ఆపాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నెల20వ తేదీ ఈడీ (వర్క్స్) కార్యాలయం ఎదుట సిఐటియు, మిత్రపక్షాల ఆధ్వర్యాన నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన ప్లాంట్ స్టోర్ జంక్షన్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ 100 శాతం వ్యూహాత్మక అమ్మకంలో భాగంగా కార్మికుల మనోధైర్యాన్ని ఆర్థిక అంశాలతో కృంగతీయాలనే ఉద్దేశంతో నూతన వేతనాలు అమలు చేయడం లేదని విమర్శించారు. 1982లో సెయిల్ నుంచి విడదీసి విశాఖ ఉక్కు కర్మాగారంగా ఏర్పడిన నాటి నుంచి వేతనాలు అమలు, మరి ఏ ఇతర ఆర్థిక అంశాలు అమలులో ఎటువంటి జాప్యం లేకుండా అమలయ్యేవని గుర్తు చేశారు. నేడు జరిగిన నూతన వేతన ఒప్పందంలో క్లాజ్ – 8 ద్వారా యాజమాన్యం విశాఖ ఉక్కు కార్మికులకు అన్యాయం చేయాలని నిర్ణయిస్తే దానిని ఏఐటియూసీ, ఐఎన్‌టియుసి సమర్థించడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైందని వివరించారు. కనుక దీనికి వ్యతిరేకంగా ప్లాంట్‌లోని ప్రధాన విభాగాలలో ప్రచారం చేసి ఆ విభాగాధిపతుల కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి వినతి పత్రాల ద్వారా సమస్య తీవ్రతను వివరించామని తెలిపారు. అందులో భాగంగానే ఈడీ (వర్క్స్) కార్యాలయం ఎదుట కూడా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ యాజమాన్య వైఖరిలో మార్పు రాకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలతో బ్లాస్ట్‌ఫర్నేస్–3ని ఏడాదిగా ఉత్పత్తి చేయకుండా నిలుపుదల చేశారని తెలిపారు. ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడవకుండా యాజమాన్యం, ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. నేడు ఇఒఐ ద్వారా ప్రయివేట్ కంపెనీలను చొప్పించే ప్రయత్నం జరుగుతోందని, దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. దీనిలో సెయిల్, ఎన్ఎండిసి వంటి ప్రభుత్వ రంగ పరిశ్రమలు, లేదా రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఇది ప్రభుత్వ రంగంగానే కొనసాగాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, యు.వెంకటేశ్వర్లు, గంగాధర్, టీవీకే.రాజు, కెవి.సత్యనారాయణ, నీలకంఠం, బిఎన్.మధుసూదన్, బి.మహేష్, విడివి పూర్ణచంద్రరావు, ఆర్.దుర్గాప్రసాద్, రామన్న, సత్యనారాయణ, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల నాయకులు

కాలేయాన్ని కాపాడుకుందాం

'కిమ్స్' డాక్టర్ చలపతిరావు ఆచంట



ప్రజాశక్తి -గాజువాక : భారతదేశంలో కాలేయ వ్యాధి ముఖ్యమైన ఆరోగ్య సమస్య అని ఇంటర్వేషనల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ చలపతిరావు తెలిపారు. 2018లో ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం దాదాపు 32 మిలియన్ల భారతీయులు హెపటైటిస్ బి వైరస్ (హెచ్‌బివి) బారిన పడినట్లు అంచనా వేసినట్లు తెలిపారు. దాదాపు 10 మిలియన్ల మంది హెపటైటిస్ సి వైరస్ (హెచ్‌సివి)తో బాధపడుతున్నారని వివరించారు. ఈ ఇన్ఫెక్షన్లు దీర్ఘకాలిక కాలేయ వ్యాధి, సిర్రోసిస్, కాలేయ కేన్సర్‌కు కారణమవుతాయని తెలిపారు.

భారతదేశంలో కాలేయ వ్యాధికి వైరల్ ఇన్ఫెక్షన్, ఆల్కహాల్ సంబంధిత కాలేయ వ్యాధి, నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్, ఆటో ఇమ్యూన్ కాలేయ వ్యాధులు ఉన్నాయని, జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా సర్వసాధారణంగా మారుతోందని పేర్కొన్నారు.

కాలేయ వ్యాధి భారతదేశంలో ఒక ప్రధాన ప్రజారోగ్య సవాలు అని, దానిని నివారించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లను ప్రోత్సహించడం, హెపటైటిస్ టీకాలకు ప్రాధాన్యతను అందించడం, కాలేయ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, చికిత్స చేయడం, మద్యపానాన్ని తగ్గించే చర్యలను అమలు చేయాలని వివరించారు.

కాలేయ వ్యాధిని నివారించడానికి టీకాలు అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి. ముఖ్యంగా హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ 2002 నుంచి శిశువులకు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించడం ద్వారా హెపటైటిస్ బి, సి వైరస్ ఇన్ఫెక్షన్, ఫ్యాటీలివర్‌ను కనిపెట్టవచ్చని, తద్వారా ముందుగానే చికిత్స ప్రారంభించవచ్చని పేర్కొన్నారు.

నేడు ముత్యమాంబ తోలేళ్ల సంబరం

ప్రజాశక్తి- కంచరపాలెం : జివిఎంసి 56వ వార్డు పరిధి కంచరపాలెం మెట్టు వద్ద ఉన్న గవర కంచరపాలెం గ్రామ దేవత ముత్యమాంబ అమ్మవారి వార్షిక నవరాత్రి జాతర బుధవారం తోలేళ్ల సంబరంతో ప్రారంభమవుతుందని గ్రామ అభ్యుదయ సంఘం ప్రతినిధులు తెలిపారు. 20న ప్రధాన పండుగ, 27వ తేదీన అమ్మవారి మారువారం జాతర, అనంతరం భారీ అన్నసంతర్పణ ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

అర్హులందరికీ నివాసం : కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎస్ఆర్.నగర్‌లో అర్హులందరికీ నివాసం కల్పిస్తామని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు స్పష్టంచేశారు. 45వ వార్డు పరిధి ఎస్ఆర్.నగర్‌లో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ఎస్ఆర్.నగర్ కాలనీలో నివాసముంటున్న వారిని గత టిడిపి ప్రభుత్వం గెంటివేసిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎస్ఆర్.నగర్.కాలనీలో నివాసం ఏర్పాటు చేసే విధంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. కాలనీలో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, జోనల్ కమిషనర్ జీవీ.నాయుడు, జీవీఎంసీ అధికారులు, వైసిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న కెకె.రాజు

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పెందుర్తి : ఆదర్శ్ డిగ్రీ కాలేజీ, పెందుర్తిలోని ఐసిఐసిఐ బ్యాంక్ ఆధ్వర్యాన ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ ఎన్ఇ.ఫ్లోరా తెలిపారు. ఐసిఐసిఐ పర్మినెంట్ ఆన్ రోల్ ఉద్యోగం అయిన "రిలేషన్ షిప్ మేనేజర్" ఉద్యోగానికి 25 సంవత్సరాల లోపు వయస్సు, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు 50 శాతం మార్కులు కలిగిన యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. బిఎ, బిబిఎ, బికాం, బిఎస్‌సి, బిసిఎ పూర్తిచేసిన, చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులని తెలిపారు. జీతం సంవత్సరానికి రూ.2.6 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఉంటుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగం కల్పించనున్నట్లు వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన యువత తమ బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ కార్డు ఒరిజినల్, జెరాక్స్, రెండు పాస్‌పోర్టు ఫోటోలతో ఆదర్శ్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించే ఇంటర్వ్యూకు ఫార్మల్ డ్రెస్‌లో హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని వివిధ కళాశాలకు చెందిన యువతీయువకులు ఉపయోగించుకోవచ్చని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి.థియోఫిలస్ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9182020936 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

21 నుంచి ఆస్కార్ చిత్రాల ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆస్కార్ అవార్డులు పొందిన చిత్రాలను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ (విఎఫ్ఎస్) ఆధ్వర్యాన ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు రోజూ సాయంత్రం 6 గంటల నుంచి విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్లు విఎఫ్ఎస్ వైజాగ్ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీన ఎలిఫెంట్ విస్పర్స్, 22న ఎవ్రీ థింగ్ ఎవ్రీ వేర్ ఆల్ ఎ టీ వన్స్, 23న ది వెల్ ఇంగ్లీష్ చిత్రాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఆస్కార్ అవార్డు సాధించిన నాటునాటు పాటను కూడా ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ ఉచిత ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు.

సమస్యలతో సహవాసం

- రామనగర్‌లో రోడ్లు అధ్వానం
- రైలు ట్రాక్, జాతీయ రహదారి మధ్యలో ఉండటంతో ప్రయాణ ఇబ్బందులు

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని రామనగర్ భౌగోళికంగా మిగిలిన పట్టణంతో కలవని ప్రపంచం. మున్సిపాలిటీలోని మిగిలిన ప్రాంతాలతో రామనగర్ వాసులకు నిత్యానుబంధాలున్నా రాకపోకలకు అర్జంటంటే కుదరదు. కాస్త ఆగి తీరిగ్గా వెళ్లాల్సిందే. అర్జెంటు పనులమీద, ఆఘమేఘాలమీద పనులు పెట్టుకునేవారు మాత్రం విసిగి వేశారిపోతారు.

రామనగర్‌కు తూర్పుగా దక్షిణ మధ్య రైల్వే లైను రైలు గేటు, ఉత్తరాన జాతీయ రహదారి-16 ఉన్నాయి. ఈ రెండూ దాటుకొని అర్జంటుగా ప్రయాణం సాగించాలంటే కాస్త ఆలోచించాల్సిందే. తూర్పునున్న రైలుగేటు రోజుకు 24 గంటల్లో సుమారు 116 రైళ్ల రాకపోకల కోసం 13 గంటల వరకు మూసేసి ఉంటుంది. అన్ని గంటలూ ప్రయాణికులు గేట్ ముందు ఆగాల్సిందే. జాతీయ రహదారి గుండా వెళ్దామంటే విశాఖపట్నం వెళ్లేవారు సుమారు రెండు కిలోమీటర్లు దక్షిణంగా ప్రయాణించి రోడ్డు టర్న్ తీసుకొని తిరిగి ఉత్తరం వైపు వెళ్లాలి. తుని వైపు వెళ్లే వారు డైరెక్టుగా వెళ్లిపోవచ్చు. ప్రమాదాలు అరికట్టే నిమిత్తం పెదపల్లి వైపు దాటకుండా అడ్డంగా పెద్ద బండరాళ్లు వేయడంతో అటో కిలోమీటరు, ఇటో కిలోమీటరు ప్రయాణించి రోడ్డు దాటాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రయాణికులు వాపోతున్నారు.

జాతీయ రహదారి ఇరుకు అండర్ పాస్

జాతీయ రహదారి అండర్ పాస్ ఉంది. దాంట్లో వెళ్లాలంటే ఆటోలు, బైక్‌లు చాలా జాగ్రత్తగా ప్రయాణించాల్సి ఉంటుంది. వర్షాకాలంలో నీటితో అండర్‌పాస్ నిండిపోతుంది. జారు బురదగా మారిపోతుంది. రాత్రులు విద్యుత్ అంతరాయం ఏర్పడితే దారి కనిపించదు. యలమంచిలి రామనగర్ వాసులు పెదపల్లి, చిన గొల్లలపాలెం, పెద గొల్లలపాలెం, మంత్రిపాలెం మొదలైన సుమారు 7 గ్రామాలకు చెందిన వారు నిత్యం పనుల కోసం ఈ రోడ్డు మీంచే వెళ్తుంటారు.



రామనగర్‌కు తూర్పు వైపున రోజూ 14 గంటలు మూసివుండే రైలు గేటు ఇదే...

టిడ్కో ఇళ్లు ప్రారంభమైతే మరింత రద్దీ

టిడ్కో ఇళ్లు గత ప్రభుత్వంలోనే దాదాపు 806 కుటుంబాలకు కేటాయించారు. అవి త్వరలోనే లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఆ కుటుంబాలు ఇళ్లకు చేరితే దాదాపు 3,000 మంది జనాభా రాపిడి రామనగర్‌కు పెరుగుతుంది. రోడ్లు, మంచినీరు, బజారు మొదలైనవి రద్దీగా మారే అవకాశం ఉంది. నిత్యావసరాల కోసం ఒత్తిడి పెరిగుతుంది.

కోతుల బెడద

మున్సిపాలిటీ మొత్తం 25 వార్డుల్లో రామనగర్ వార్డు భౌగోళికంగా విశాలంగా ఉంటుంది. చెట్లతో కళకళలాడుతుంది. దీంతో ఇక్కడకు చొరబడ్డ కోతులు ఆ ప్రాంతం విడిచి పోవు. అవి ఇళ్లలోకి చొరబడి నానా రభస చేస్తుంటాయి. అడపా దడపా మున్సిపాలిటీ చర్యలు తీసుకొని వాటిని పట్టించి, దూరంగా తరలించినా అవి తిరిగి ఇక్కడికే వస్తున్నాయి.

రోడ్లు అధ్వానం

రామనగర్‌లో రోడ్లు నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారయ్యాయి. చినుకుపడితే చాలు చిత్తడిగా మారిపోతాయి. ప్రధాన రహదారిలో రోడ్డంతా గుంతలమయం కావడంతో వర్షం వచ్చిందంటే చాలు రోడ్లు చెరువుల మాదిరిగా మారిపోతాయి. ఎక్కడ గుంతలున్నాయో తెలీక వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ రోడ్లు వెయ్యడానికి మున్సిపాలిటీ టెండర్లు అయితే పిలిచింది గాని బిల్లుల చెల్లింపులు జరుగుతాయో లేదోనని కాంట్రాక్టర్లెవరూ ముందుకు రావడం లేదని స్థానిక నేతలు చెబుతున్నారు. ఎన్నికల ముందైనా సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



పిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

కేన్సర్ రోగికి పిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

కేన్సర్ రోగికి మంజూరైన పిఎం రిలీఫ్ ఫండ్‌ను మంగళవారం బాధితునికి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి అందజేశారు. అనకాపల్లి 83వ వార్డుకు చెందిన జక్కుల కృష్ణ ధనలక్ష్మి దంపతుల కుమారుడు కార్తికేయ బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. వైద్య నిపుణులు వెల్లూరు కేన్సర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. చికిత్స నిమిత్తం రూ.5 లక్షలు ఖర్చవుతుంది. దీంతో ఆ దంపతులు సహాయం నిమిత్తం పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతిని ఆశ్రయించారు. దీనిపై స్పందించి పీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆమె సిఫార్సు చేయగా, రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును మంగళవారం ఎంపీ సత్యవతి తన క్యాంపు కార్యాలయంలో బాధితునికి అందజేశారు. ఎంపీ సత్యవతి తక్షణమే స్పందించి ఆర్థిక అందించినందుకు కృష్ణ ధనలక్ష్మి దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వడదెబ్బపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు



డాక్టర్ సుబ్రహ్మణ్యం

ఎండలు విపరీతంగా ఉన్నందున ప్రతి ఒక్కరూ చెమట ఇంకిపోయే బట్టలు వేసుకోవాలని మండలంలోని చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలకు రక్త విరోచనాలు, డయేరియా, వడదెబ్బ మొదలైనవి వచ్చే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. మధ్యాహ్నం ఒంటి గంట రెండు గంటల తర్వాత వడదెబ్బ తెగలే ప్రమాదముందని, ప్రజలు ఉదయాన్నే తమ పనులు ముగించుకొని ఎండ తగలకుండా నీడని ఉండాలన్నారు. కొబ్బరి నీళ్లు, గంజి, మజ్జిగ, సబ్జా గింజల నీళ్లు, పండ్లు రసాలు వంటి ద్రవాలు సేవించాలని సూచించారు. వేసవిలో నూలు బట్టలు వేసుకోవడం అన్ని విధాలుగా ఆరోగ్యానికి మంచిదన్నారు. తలనొప్పి, కడుపులో వికారంగా ఉండడం, ఒళ్ళు నొప్పులు, మగతగా ఉండడం వంటివి వడదెబ్బ లక్షణాలని, ఆ లక్షణాలుంటే వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయంతో పాటు మందులు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆహారం తక్కువ తక్కువగా ఎక్కువసార్లు తినాలని, ఎక్కువ మోతాదులో ఒకసారి తీసుకోకూడదని సూచించారు.



రైతులతో మాట్లాడుతున్న నైరా వ్యవసాయ విద్యార్థులు

పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన

ప్రజాశక్తి-కె.కోటపాడు

రసాయనక ఎరువులు వినియోగించి భూమి సారాన్ని పాడు చేయకుండా, వాటి స్థానంలో పచ్చిరొట్ట ఎరువులు వినియోగించాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. మండలంలోని సింగన్నదొరపాలెంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వాడటం వల్ల భూమి సారాన్ని పెంచి మంచి దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులపై రైతులకు అవగాహన లేకపోవడంతో అధిక మొత్తంలో రసాయనకు ఎరువులు వాడుతున్నారని తెలిపారు. జీలుగ, జనుము విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని, వాటిని పొలాల్లో వెదజల్లి పంట కాలంలో నేలలో కలిసిపోయేటట్లు కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఆధునిక వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు పుష్ప మంజరి, ఉమ, స్నేహలత, తేజేశ్వరి పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని పి.భీమవరం రామాలయంలో బుధవారం వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ పినపోలు రామునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని, అవసరమైన వారికి కంటి అద్దాలు, ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు. సమీప గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

14వ రోజుకు రుషిల్ డెకార్ కార్మికుల నిరసన



నినాదాలు చేస్తున్న రుషిల్ డెకార్ కంపెనీ మురా కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రుషిల్ డెకార్ ప్లైవుడ్ కంపెనీ మురా కార్మికులు కంపెనీ ఎదుట నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో 14వ రోజుకు చేరింది. మంగళవారం మండుటెండలో తమ ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఒప్పందం ప్రకారం తమకు కూలి రేట్లు చెల్లించాలని, తమకు పనులు కల్పించాలని కోరారు. ప్రస్తుతం తమకు పనుల్లేకపోవడంతో కుటుంబాలు గడవక గత్యంతరం లేని పరిస్థితిలో మండు టెండలను సైతం లెక్కచేయకుండా పరిశ్రమ ఆవరణలో ఆందోళన కొనసాగిస్తున్నామని చెప్పారు. సుమారు 100 మంది కార్మికులు తమ ఇల్లు వదిలి ఎండలో చేస్తున్న దీక్షలకు అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. ఎస్ఇజెడ్ నిర్వాసితులందరూ ఏకమై ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయడానికి తమతో కలిసి వచ్చిన రాజకీయ పార్టీలకే రానున్న ఎన్నికలలో ఓట్లు వేసి గెలిపిస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్, తాగునీరు నిరంతరం సరఫరా చేయాలి

ప్రజాశక్తి- పరవాడ




నినాదాలు చేస్తున్న మహిళలు

మండలంలోని కలపాక పంచాయతీ పరిధి మూల స్వయంవరం గ్రామంలో విద్యుత్, తాగునీరు నిరంతరం సరఫరా చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో పర్యటించిన ఆమె ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారం రోజులుగా విద్యుత్, తాగునీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ ఒకపక్క ఎన్టీపీసీ బొగ్గు, ఇంకో పక్క నీటి కొరత, కరెంటు కోతతో ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం, ఎన్టీపీసీ సింహాద్రి అధికారులు స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.మహాలక్ష్మి, కె.లక్ష్మి, కె.నూకరత్నం, కె.సాయి, వై.కుమారి, వరలక్ష్మి, కె.మహాలక్ష్మి, ఎం.లీల తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ అధ్యక్షునిగా సాయి ప్రసాద్

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) అధ్యక్షులుగా ఆ గ్రామానికి చెందిన ఆకుల సాయిప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. తనను ఈ పదవిలో నియమించినందుకు సాయి ప్రసాద్ డిప్యూటీ సిఎం బూడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, వైసిపి నాయకులు దాట్ల శివాజీ పాల్గొన్నారు.



సాయి ప్రసాద్‌కు నియామక పత్రం అందజేస్తున్న డిప్యూటీ సిఎం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వెలుగు సిబ్బంది

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని తేగాడ గ్రామంలో ఎపి మోడల్ స్కూల్ పిల్లలకు వెలుగు సిబ్బంది మంగళవారం రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మార్తా తిలకం మాట్లాడుతూ సిగ్నల్ లైట్స్‌ను పాటించాలన్నారు. అధిక వేగం ప్రమాదానికి మూలమని, నిదానంగా వెళ్లాలని సూచించారు. హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని కోరారు. ముందుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీ అనురాధ, వివఎలు మంగ లక్ష్మి, చిన్నపాప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జ్యోతిర్మయ ట్రస్టు ప్రతినిధులు

'డబ్బులు వసూలు, మోసాలు చేసే వారితో మా ట్రస్టుకు సంబంధం లేదు'

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం, అమరపురి (కోమల్లపూడి)లో గల శ్రీజ్యోతిర్మయ ట్రస్ట్‌కు వివిధ చోట్ల బ్రాంచ్ ఆఫీసులు ఉన్నాయని చెప్పి భక్తులు దగ్గర ఎవరైనా డబ్బులు వసూలు చేసినా, మోసాలకు పాల్పడినా ఆ వ్యక్తులకు, తమ ట్రస్ట్‌కు ఎటువంటి సంబంధం లేదని ట్రస్ట్ అధ్యక్షులు దేవాళ్ళ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గొన్న సాయిబాబు, కార్యదర్శి వైజి వెంకయ్య తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొంతకాలం భక్తుల సహాయ సహకారాలతో ఆలయ నిర్మాణం జరిగిందని, భక్తుల సౌకర్యార్థం వంటశాల నిర్మాణానికి పార్లమెంటు సభ్యులు నిధులు రూ.20 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. వందలాది ఔషధ మొక్కలతో సంజీవని వనాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఉచితంగా వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రం పేరుతో ప్రజల, భక్తుల నుండి చందాల వసూలు చేస్తున్నట్లు తెలిసిందని, అలాంటి వారు ఎవరైనా ఉంటే తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ వెంకట కష్ణయ్య చౌదరి, చరకాన బాబూరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట

మండలంలోని కేపీ అగ్రహారం ఊటబంద చెరువులో ఉపాధి హామీ పనులను మంగళవారం జెడ్పిటిసి దొండ రాంబాబు, సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, ఎంపిటీసీల ఫోరమ్ అధ్యక్షులు దేవర అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పి.మాణిక్యం, పాల సంఘం అధ్యక్షులు తూరబిల్లి కాసు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

శిరసపల్లిలో 'గడపగడపకు మన ప్రభుత్వం'



పట్టణ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవీఎంసీ విలీన గ్రామం శిరసపల్లిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా 84వ వార్డులో కోటి 30 లక్షల రూపాయలతో నిర్మించిన వైయస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలను, మందులను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో సీఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు జీవీఎంసీ నుంచి అవసరమైన అనుమతులు రప్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలో పర్యటించారు. స్థానికులు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. దీనిపై స్పందిస్తూ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రూ. 20 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పలక యశోద రవి, కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి నీలబాబు, జెసిఎస్ ఇన్చార్జి కొణతాల మురళీకృష్ణ, 84వ వార్డు వైసిపి నాయకులు ఈగల మహేష్, కె సురేష్, గొల్లవిల్లి నరసింగరావు, కోరుకొండ రాఘవ, ఆళ్ల నాగేశ్వరరావు, కె శంకర్, మలసాల కిషోర్ పాల్గొన్నారు.

భూ సేకరణ పూర్తి కాకే రహదారి విస్తరణ చేపట్టలేదు

స్పందనలో ఫిర్యాదుదారునికి ఆర్ అండ్ బి అధికారుల లేఖ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అనకాపల్లి-అచ్యుతాపురం రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేయడానికి రూ.347 కోట్లు మంజూరైనా, భూ సేకరణ పనులు పూర్తి కాకపోవడం వల్లే పనులు ప్రారంభించలేదని ఆర్ అండ్ బి అచ్యుతాపురం సెక్షన్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎంపిఆర్ఎ.రాజు తెలిపారు. ఈ మేరకు తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన ఆడారి రామకృష్ణ కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో రహదారి విషయమై పలు ప్రశ్నలతో ఆర్ అండ్ బి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆర్ అండ్ బి సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయం నుంచి మంగళవారం దరఖాస్తుదారుడు ఆడారి రామకృష్ణకు లేఖ పంపించారు. ఈ లేఖ ప్రకారం... 2020 జూన్ 22న రహదారి విస్తరణకు రూ.347 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రహదారి నిర్మాణానికి బివిఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ కంపెనీతో ఒప్పందం కుదిరిందని, పనులు చేయడానికి కన్స్ట్రక్షన్ కంపెనీ సిద్ధంగా ఉన్నప్పటికీ, భూ సేకరణ పనులు పూర్తి కాకపోవడం వలన రహదారి నిర్మాణ పనులు ప్రారంభించడానికి జాప్యం జరుగుతుందని తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో పడిన వర్షాల కారణంగా అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి దెబ్బతిందని, దీని మరమ్మతులకు రూ.79 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నిధులతో ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయని, ఈ నెలాఖరుకు ఈ పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు.

చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఈనెల 20న అన్ని నియోజకవర్గాల ప్రధాన కేంద్రాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పార్టీ శ్రేణులకు సూచించారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, అన్న సమారాధన, పేదలకు నిత్యవసర సరుకులు, బట్టలు పంపిణీ, ఆసుపత్రుల్లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు రాష్ట్ర కార్యాలయానికి, సోషల్ మీడియాకి పంపాలని సూచించారు.

20న ఎ.కోడూరులో....

కె.కోటపాడు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఈ నెల 20న మండలంలోని ఎ.కోడూరు జంక్షన్ వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు కేక్ కటింగ్, అనంతరం రక్తదాన శిబిరం, మధ్యాహ్నం అన్నసమారాధన, పేదలకు చీరల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మాడుగుల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుండి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రక్తదాన శిబిరంలో స్వచ్ఛంద రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పైలా ప్రసాదరావు కోరారు.

7న జనసేన బహిరంగ సభ

ప్రజాశక్తి - యలమంచిలి : జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు మే 7న నియోజకవర్గంలో బహిరంగ సభకు వస్తున్న సందర్భంగా కనీసం 10 వేల మంది హాజరయ్యే విధంగా పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పార్టీ నియోజకవర్గ కార్యకర్తలతో స్థానిక బస్టాండ్ సమీపంలోని పార్టీ కార్యాలయంలో సమావేశమై మాట్లాడారు. రాంబిల్లి మండలం వెంకటాపురంలో అదే రోజు నియోజకవర్గ సెంట్రల్ ఆఫీసు ప్రారంభమౌతుందని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, రూరల్ అధ్యక్షులు లాలం సోమునాయుడు, సీనియర్ నాయకులు కొలగాని భాస్కరరావు, గుర్రాల శేఖర్, చిట్టిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నాయకులు విజయ్‌కుమార్



కూలీలతో మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

విద్యుత్తు, బస్సు ఛార్జీలు తగ్గిస్తాం

ప్రజాశక్తి-అనకాపల్లి : వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే విద్యుత్తు, బస్సు ఛార్జీలు తగ్గిస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని పాపయ్య సంతపాలెంలో మంగళవారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పీలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రమే అభివృద్ధి చెందాడన్నారు. ఓ పక్క రాష్ట్రంలో ప్రజలు పేదవారుగా మారుతుంటే జగన్ రెడ్డి కోట్లకు కోట్లు సంపాదిస్తున్నాడని పేర్కొన్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో సమావేశమై వైసిపి నిరంకుశ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగిరెడ్ల గోవింద, మాజీ ఎంపిటీసీ సభ్యుడు శెట్టి వెంకటరమణ, టిడిపి నాయకులు తలారి కాశీనాయుడు, మధుపాడ నరసింగరావు, దాడి నాగేశ్వరరావు, కరణం రమణ, రాకోటి అప్పారావు, బత్తుల రమేష్, కరణం పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముసలి తల్లి అమ్మవారిని దర్శించుకున్న పీలా

పట్టణంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ముసలి తల్లి అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయనను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, బిఎస్ఎన్ఎల్ జోగినాయుడు, వేగి కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు కాండ్రేగుల రమణ అప్పారావు, కొణతాల శ్రీనివాసరావు, కొణతాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

అమరావతి జెఎసి ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : అమరావతి జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమరావతి జేఏసీ అనకాపల్లి జిల్లా చైర్మన్ ఎస్-ఎస్‌వి‌ఎస్ నాయుడు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఆర్‌సి ఏరియర్స్ తక్షణమే చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసిపిఈఏ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అప్పలరాజు, యూనిటీ ప్రెసిడెంట్ బి చిన్నారావు, ఉపాధ్యక్షులు టి.వెంకటేశ్వరరావు, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ వైస్ ప్రెసిడెంట్ ఎం నీలకంఠేశ్వరరావు, వర్షిని, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్‌జెడి తనిఖీలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని కొరువాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకులు చిన్నమ్మాయిదేవి మంగళవారం సందర్శించి రికార్డులు, మెడికల్ కిట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మెనూ సక్రమంగా అర్హులందరికీ అందజేయాలన్నారు. అనీమియాతో ఉన్న గర్భిణులు, బాలింతలు ఐఎఫ్ఎ కాల్షియం మాత్రలు వేసుకోవాలని సూచించారు. మిషన్ వాత్సల్య స్కీం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ కె.కోటపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ మంగతాయారు, సూపర్వైజర్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఐసిడిఎస్ అధికారులు

అభివృద్ధి పనులను పరిశీలించిన బూడి



హాస్టల్ భవనంలో అపరిశుభ్రతను పరిశీలిస్తున్న బూడి

ప్రజాశక్తి -మాడుగుల : మండల కేంద్రంలో జరుగుతున్న వివిధ రహదారులు, కాలువల నిర్మాణాలపై మంగళవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పరిశీలించి సమీక్ష జరిపారు. మాడుగుల టీచర్స్ కాలనీ, అర్బన్ కాలనీల్లో రూ. కోటి 30 లక్షలతో చేపడుతున్న 21 రహదారులు, కాలువలు నిర్మాణాలు పరిశీలించారు. మోదమాంబ కాలనీలో శిధిలావస్థకు చేరిన వసతిగృహం పరిశీలించారు ఇక్కడ మార్కెట్ యార్డ్ నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపుతామని మంత్రి వెల్లడించారు. అలాగే అర్బన్ కాలనీలో పాత వసతి గృహాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి ఎన్నికల హామీలు మేరకు నియోజకవర్గంలో పాటు రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెదబాబు సర్పంచ్ కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వైసిఇప నాయకులు ఎడ్ల హేమంత్, వరహాలు, అచ్యుతం, కుక్కర శ్రీధర్ పాల్గొన్నారు

భూసార పరీక్షలతో ప్రయోజనం

ప్రజాశక్తి-మాడుగుల : మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలతో పంటలను సాగుచేయడం, యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల మంచి ప్రయోజనముంటుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ అన్నారు మంగళవారం మండల కేంద్రంలో మట్టి నమూనా సేకరణ, పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయడం ద్వారా భూమిలో ఉన్న లోపాలు తెలుస్తాయని తద్వారా దానికి అనుగుణంగా ఎరువులు, సాగుయాజమాన్యం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపిటిసి లు విజయలక్ష్మి, మహేశ్వరి, ఆర్‌బికె సిబ్బంది కుక్కర శ్రీధర్, బొడ్డేటి మహాలక్ష్మి నాయుడు కర్రి నాగేశ్వరరావు సిబ్బంది జ్యోతి,రేణుక పాల్గొన్నారు

ఎస్ఐని కలిసిన సర్పంచ్

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్రను మంగళవారం సిహెచ్.నాగాపురం సర్పంచ్ యలమంచలి రఘురామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అప్పన దివాణం, గంట్ల బుచ్చిబాబు, చినబాబులు పాల్గొన్నారు

రూ.1.10 కోట్లతో కొత్తకోటలో డ్రెయినేజీ పనులు

గడపగడపకూ ప్రభుత్వంలో విప్ ధర్మశ్రీ



గడపగడపలో పర్యటిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

ప్రజాశక్తి -కొత్తకోట : మేజర్ పంచాయితీ కొత్తకోటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు రెండు సచివాలయాల పరిధిలో గడపగడపకూ వెళ్లిన ధర్మశ్రీ, కొన్నాళ్ల విరామం తర్వాత మంగళవారం మూడో సచివాలయ పరిధిలోనూ కార్యక్రమం నిర్వహించి ముగించారు. ఈసందర్భంగా అపారిశుధ్యంపై ప్రజల నుంచి ఎక్కువగా వినతులు రావడంతో స్పందించిన ధర్మశ్రీ, రూ.కోటి పది లక్షలతో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని, అందుకు తగిన నిదులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. మూడు సచివాలయాల పరిధిలో ప్రభుత్వ గ్రాంటు రూ.60 లక్షలు, టిటిడి నిధులు రూ.30 లక్షలు, మండల పరిషత్ గ్రాంటు రూ.20 లక్షలతో ఈ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. గ్రామంలో పారిశుధ్య సిబ్బంది ఇష్టారాజ్యంగా పనిచేయడం వల్లే సమస్య ఉత్పన్నమౌతోందని, వెంటనే వారిని తొలగించి కొత్త వారిని నియమించడంతోపాటు స్పెషల్ డ్రైవ్ పూర్తయ్యే వరకు అదనపు సిబ్బంది, యంత్రాలతో పనులు చేయించాలని మేజర్ పంచాయితీ కొత్తకోట కార్యదర్శి కృష్ణమోహన్, సర్పంచ్ కోన లోవరాజుకు సూచించారు. ఈ నెల 20 నుంచి చేపట్టే పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లో ప్రతిరోజూ తాను పాల్గొంటానన్నారు.ఆర్‌బికెల నిర్మాణ పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేసి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను మందలించారు. కార్యక్రమంలో ఎంపిపి, పైల రాజు, డిసిఎంఎస్ డైరెక్టర్ జి. సత్యదేవ్, గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పి.దేవ, ఎంపిడిఒ వెంకన్న బాబు, ఎంపిటిసి పూడి దేవ, పైల చిన్నమ్ములు, కె. లక్ష్మి, వైసిపి నాయకులు తలారి ఆదిమూర్తి, శీలం శంకర రావు, జి.దొరబాబు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నాణ్యతను పరిశీలించిన అధికారులు



సిసి రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కొత్తమల్లంపేట గ్రామంలో రూ. 5లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను విజిలెన్స్ అండ్ క్వాలిటీ డిఇఇ బోలెం యర్రాపాత్రుడు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రోడ్డు పొడవు వెడల్పు, అలాగే మందం కొలతలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలిరెడ్డి రాజబాబు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సౌందర్య పాల్గొన్నారు.

త్వరితగతిన ఎస్‌టిజి సర్వే పూర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి : ఎస్‌టిజి సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ సీతారామరాజు ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ,అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్‌టిజి సర్వేలో భాగంగా గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలు, 6-19 వయస్సుగల పిల్లలు వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేసి శుక్రవారం నాటికి సర్వే పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి శతశాతం సేవలను అందించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఓటరు కార్డ్‌లకు శతశాతం ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఇఒపిఆర్‌డి వెంకటనారాయణ, సిడిపిఒ శ్రీవిద్య పాల్గొన్నారు .


రోలుగుంట పిఎసిఎస్ చైర్మన్‌గా తాతబాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న తాతబాబు

ప్రజాశక్తి-రోలుగుంట : రోలుగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన చైర్మన్‌గా మద్దు తాతబాబు నియమితులయ్యారు. మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా గతంలో చెట్టుపల్లి వెంకటరావు కొనసాగేవారు. ఆయనను తప్పించి నూతనంగా మద్దు తాతబాబును ఎంపిక చేశారు. ఈ నూతన త్రిసభ్య కమిటీలో నిండుగొండకు చెందిన ద్వారపురెడ్డి రామ్మూర్తిని, కొవ్వూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి అప్పలనాయుడును సభ్యులుగా నియమించారు.

502వ రోజుకు మత్స్యకారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : న్యాయం జరిగే వరకు హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు సంబంధించి పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకార జెఎసి నేతలు స్పష్టం చేశారు.పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారు శాంతియుత మహా ధర్నా 502వ రోజుకు చేరిన సందర్భంగా .మంగళవారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, చేపల సోమేష్, బాబూజీ, నూకరాజు, పిక్కి కోదండరావు, కాశీ, రాజు, కోటి, , జాను, కాశీ రావు, వీర్రాజు, అప్పలరాజు, కాశీ ఆదిరాజు, తాతబాబు, నల్ల పాల్గొన్నారు .

మండుటెండలతో జనం బెంబేలు



ఉదయం పది గంటలకే నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

ప్రజాశక్తి కోటవురట్ల : భగభగ మండుతున్న భానుడి ప్రతాపానికి గడిచిన వారం రోజులుగా మండలవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు, మండుటెండలకు తోడు వడగాలులు వేయడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఉక్కపోతతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 8:00 కి మొదలైన ఎండవేడి, రాత్రి 8 గంటల వరకు తగ్గడం లేదు. వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యులు సంతోష్ కుమార్ సూచించారు. అత్యవసరమైతేగాని పగటిపూట బయటకు రావడం మంచిది కాదని, ఒకవేళ తప్పనిసరైతే తగు జాగ్రత్తలతో రావాలని సూచించారు.

పంచకర్లను కలిసిన రమేష్

ప్రజాశక్తి- గొలుగొండ : విశాఖ జిల్లా వైసిపి అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబును గొలుగొండ మండల ఉప సర్పంచ్, వైసిపి సేవాదళ్ జోనల్ ఇంచార్జ్ సేనాపతి రామ్మూర్తి రమేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి డివిజన్‌లో సేవాదళ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బాలరాజుఉన్నారు.

సంఘాల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :గ్రామ సంఘాల సహాయకులు అన్ని విషయాల్లో అవగాహన ఉండాలని ఎపిఎం పార్వతి భాయి సూచించారు. మంగళవారం మండల మహిళా సమాఖ్య భవనంలో గ్రామ సమాఖ్య సహాయకులతో సమీక్ష నిర్వహించారు. అజెండాలో భాగంగా మొబైల్ బుక్ కీపింగ్, బ్యాంకు లింకేజీ, ఎఫ్‌పిఒ సంఘాలుఏర్పాటు, స్త్రీనిధి, లక్షపతి దీదీ, గ్రామసంఘం ఆడిట్స్, సోషల్ మొబలైజేషన్, స్వయం సహాయక సంఘాల గ్రేడింగ్, లైవ్ లీ హుడ్, సిఐఎఫ్ కొత్త అప్పులు మంజూరు తదితర సంఘాలకు సంబంధించి అంశాలతోపాటు రహదారుల భద్రత, మహిళలు, బాలికల్లో రక్తహీనత, బాల్యవివాహాలు ,కళ్యాణమస్తు, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, శ్రీను, స్త్రీనిధి మేనేజర్ కనకమహాలక్ష్మి, సిసిఎస్ రాజశేఖర్, రామలక్ష్మి జగదీష్, అకౌంటెంట్ శాంతి పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్నే మా భవిష్యత్తు'



ఆనంద్‌కుమార్‌ను సమస్యలపై ప్రశ్నిస్తున్న సిపిఎం నేత బాబూరావు

ప్రజాశక్తి -యంత్రాంగం

ములగాడ : జివిఎంసి 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యాన గొల్లవీధి, రెడ్డివీధి ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు నిర్వహించారు. 350 గడపలను సందర్శించి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి దాడి సత్యనారాయణ, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, పిలకా రామ్మోహన్ రెడ్డి, భూస అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సిపిఎం నిలదీత

మల్కాపురంలో పూర్వం నుంచి ఉన్న కాలువల నుంచి వస్తున్న దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ సిపిఎం నాయకులు వి.బాబూరావు నిలదీశారు. వీధుల్లోకి చెత్త బండి రావటం లేదని, అర్హులకు పెన్షన్లు అందడం లేదని ప్రశ్నించారు. త్వరలోనే సమస్య పరిష్కరించాలని ఆనంద్‌కుమార్ అధికారులను కోరారు.

సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు పరిధి వైఎస్ఆర్ నగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కంపా హనోక్, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఇంటింటికీ వెళ్లి సమస్యలనడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలనపై ప్రజా అభిప్రాయాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో 45వ వార్డు వైసిపి అధ్యక్షులు పైడి రమణ, జెసిఎస్ మండల కన్వీనర్ వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

యస్. రాయవరం : జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పిఎసిఎస్ అధ్యక్షుడు చేకూరి శ్రీరామచంద్రరాజు అన్నారు. మంగళవారంకొర్రుప్రోలు గ్రామంలోని బిసి కాలనీలో నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి చెందితే మిస్డ్ కాల్ ఇవ్వాలని సూచించారు. సంక్షేమ ఫలాలు అందాలంటే మరల జగనన్న ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని కోరారు.కార్యక్రమంలో గ్రామ ఇంఛార్జ్ సర్పంచ్ కొరుపాటి గోపాలం, వాలంటీర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలో కైలాసపట్నం గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూకరత్నం, ఎంపీటీసీ సభ్యులు వెంకటరమణ,మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, వైసిపి సీనియర్ నాయకులు సత్తిబాబు, డివి యువసేన అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై ఆరా



కార్డుదారులను విచారిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కల్యాణపులోవ డిపో నెంబర్ 24 పరిధిలో జెడ్.జోగింపేట, రొచ్చుపనుకు, బంగారుబంద, తాటిపర్తి గ్రామాల్లో రేషన్ పంపిణీపై తహశీల్దార్ మహేశ్వరరావు. సివిల్ సప్లై అధికారి కేతా ఈశ్వరరావు, ఆర్ఐ చినబ్బాయి ఆరా తీశారు. గత రెండు నెలలుగా రేషన్‌డిపో ద్వారా తమకు బియ్యం అందటం లేదని పలువురు మహిళా కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు స్పందించి, విచారించారు. లబ్ధిదారుల నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ,నివేదికను జెసికి అందజేస్తామని, వారి సూచనల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో ఈనెల 18 నుంచి 26 వరకు నిర్వహించనున్న ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ అన్నారు, 18 ,19,20 తేదీల్లో పీకే.పల్లి, 18 19 తేదీల్లో లింగాపురం, 20న తంగేడు, 25, 26 తేదీల్లో బికేపల్లి, బోడపాలెం గ్రామాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసి కొత్తగా నమోదుతోపాటు ఆధార్ అప్‌డేట్ చేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

గొలుగొండ : మండలంలో పలు సచివాయాల్లో నిర్వహించే ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ డేవిడ్‌రాజు అన్నారు. ఈ నెల 18, 19, 20, 26, 27 తేదీల్లో మండలంలో గొలుగొండ, గుండుపాల, కేడిపేట, పుత్తడిగైరంపేట సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఈ గ్రామస్థులే కాకుండా మిగిలిన సచివాలయాల్లో ఉన్న వారు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వికలాంగ విద్యార్థులకు ఉపకరణాలు



ఉపకరణాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

ప్రజాశక్తి - రావికమతం : వికలాంగ విద్యార్థుల అభ్యున్నతికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం మండలంలో మేడివాడ జెడ్పి హైస్కూల్‌లో విభిన్న ప్రతిభావంతుల సహిత విద్యా కార్యక్రమంలో 51మంది విద్యార్థులకు రూ.ఐదు లక్షల విలువైన వికలాంగ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఎనిమిది మందికి వీలుచైర్లు,రెండు ట్రైసైకిళ్లు, రెండు సిపి చైర్లు, ఎనిమిది వినికిడి యంత్రాలు, 31మంది బుద్ధిమాంద్యం గల విద్యార్థులకు ఎంఆర్ కిట్లను అందజేశారు.. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ వికలాంగ బాలలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ అధికారిణి శకుంతల మాట్లాడుతూ సమగ్ర శిక్ష నుంచి వికలాంగ విద్యార్థులకు ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్, హోంబేస్డ్ అలవెన్స్, గర్ల్స్ స్టైఫండ్ కూడా అందించామన్నారు. వికలాంగులకు ఉపకరణాలు రావడంతో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడుల కృషిని అభినందించారు. విద్యార్థులకు నేషనల్ స్కాలర్‌షిప్ కూడా వచ్చిందన్నారు. ఎంపిపి పైలా రాజు, జెడ్‌పిటిసి రమణమ్మ ఆదిమూర్తి, సర్పంచ్ శివ, పాఠశాల చైర్మన్ శేషు, ఎంపిటిసి జి సత్యప్రసాద్, ఎంఇఒ జయలక్ష్మి, హెచ్ఎం ఎం.జయలక్ష్మి, కవగుంట సర్పంచ్ వరహాలు పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిని గద్దె దింపడమే లక్ష్యం

ప్రచారభేరి పాదయాత్రలో సిపిఎం, సిపిఐ నేతలు

మతోన్మాద బిజెపిని గద్దె దింపడమే లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం కలిగించి, సమాయత్తం చేయడమే సిపిఎం, సిపిఐ ప్రచారభేరి పాదయాత్ర లక్ష్యమని ఆయా పార్టీల నేతలు స్పష్టం చేశారు. పలు ప్రాంతాల్లో కరపత్రాలను పంచుతూ పాదయాత్ర నిర్వహించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు వివరించారు. (ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)



నాతవరంలో ప్రచారభేరిలో సిపిఐ, సిపిఎం నేతలు

నాతవరం : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యేతిరేక విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం నాతవరంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఆసుపత్రి వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, సిపిఐ జిల్లా సమితి నాయకులు గిరిబాబు, ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు ఎల్‌వి రమణలు, మహిళామండలి జిల్లా కార్యదర్శి కార్యదర్శి బి. సుబ్బలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమలో సిపిఐ మండల శాఖ కార్యదర్శి ఈ. అప్పారావు, నర్సీపట్నం రూరల్ కార్యదర్శి ఎన్.శ్రీరామ్మూర్తి, ఎపి గిరిజన సంఘం నాయకులు భాస్కరరావు, నాతవరం ముఠా కార్మికనేత కె. తాతారావు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం కూడలి, వేములవలస బీసీ కాలనీలో కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీ, పాదయాత్ర చేశారు. ఈ మేరకు ఈ నెల 26న స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం జోన్ కమిటీ సభ్యులు రవ్వ నర్సింగరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కళాసీలు, పంచాయతీ వర్కర్స్, ప్లైవుడ్ కార్మికులు, ఐద్వా నాయకులు కె.నాగరాణి, సిఐటియు మండల కార్యదర్శి డి.రమణ ఎన్.రామారావు పాల్గొన్నారు

ములగాడ : సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన జివిఎంసి 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 63వ వార్డు కార్యదర్శి కె.పెంటారావు, ఏరియా కార్యదర్శి పి.సూర్యనారాయణ, కార్యకర్తలు రామకృష్ణ, లక్ష్మణరావు, బాల, ఎస్.వాసు, ఎస్ఎస్.అప్పారావు, బి.రమణ, ఎస్.నాగేంద్ర, హరికృష్ణ, పైడిరాజు, నవీన్, ఎ.గోవింద్, విష్ణు రాహల్ తదితర్లు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి రిక్షా కాలనీ, శ్రీనివాస నగర్, బాపూజీనగర్ ప్రాంతాలలో ప్రచార భేరి నిర్వహించారు. పాదయాత్ర చేస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం మధురవాడ జోన్ కార్యదర్శులు వి.సత్యనారాయణ, డి.అప్పలరాజు, బి.భారతి, నారాయణరావు, ఎమ్‌డి బేగం, డి.తులసి తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మాధవధార ప్రాంతంలో ప్రచారభేరి నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు కూన వెంకటరావు ఆధ్వర్యాన జరిగిన ప్రచార భేరిలో సిపిఎం సీనియర్ నాయకులు కె.సుధాకరరావు, నాయినబాబు, పేడాడ పాండు రంగారావు, ఎస్‌టివి. రమణ మూర్తి, నర్సింగరావు, కంచరపాలెం ఎస్ఎఫ్ఐ నాయకులు సనపల శ్రావణ్‌కుమార్, సిపిఐ నాయకులు చంద్రశేఖర్, నాగభూషణ్ పాల్గొన్నారు.

కంచరపాలెం : మర్రిపాలెం శివనగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెలుగు రమణ, ఒ.అప్పారావు, ఎం.ఈశ్వరరావు, కె.లక్ష్మణ్, బి.వినోద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : పూర్ణా మార్కెట్ అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ప్రచార భేరి కార్యక్రమం ప్రారంభమై స్ప్రింగ్ రోడ్డు, మెయిన్ రోడ్డు, ఎవిఎన్ కాలేజీ, వెలంపేట తదితర ప్రాంతాల్లో సాగింది. మోడీ ప్రభుత్వం ప్రజలను ఎలా మోసగిస్తోందో వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. నాలుగు రోడ్ల సెంటర్లలో చిన్నపాటి సమావేశాలు నిర్వహించారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎం.మన్మధరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు మాట్లాడారు. మేస్త్రీలు ఆదినారాయణ, బి.సాంబయ్య, జి.సూరిబాబు, ఎ.పైడిరాజు, కృష్ణ పాల్గొన్నారు.

అలాగే సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో వై.రాజు అధ్యక్షతన కనకల దిబ్బ, ప్రకాశరావుపేట, ప్రసాద్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్ మాట్లాడారు. సిఐటియు నాయకులు జి.అప్పలరాజు, కెవిపి.చంద్రమౌళి, మత్స్యకారుల సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, హోటల్ యూనియన్ నాయకులు రామారావు పాల్గొన్నారు.

అల్లిపురం, నేరెళ్ల కోనేరు, ఏడు గుళ్లు జంక్ ప్రాంతాలలో నిర్వహించిన ప్రచారభేరిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు జి.కాసులరెడ్డి, చెల్లూరి బుజ్జి, జి.లక్ష్మణరావు, జి.ఫణీంద్ర, యు.నాగరాజు, అశోక్, భరత్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని, ఆ సమయము ఆసన్నమైందని సిపిఎం మండల నాయకులు ఎర్ర దేవుడు అన్నారు. మండలంలోని కింతాడ శివారు రామచంద్రపురం గ్రామంలో మంగళవారం ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తూ బడా పెట్టుబడిదారులైన అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచుపెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి ప్రసాదు, ఆర్ ముత్యాల నాయుడు, వనము సూర్యనారాయణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని గర్సింగి పంచాయతీ పరిధి వెంకటరాజుపురంలో సిపిఎం నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజలపై అనేక భారాలు మోత మోగుతుందన్నారు. విభజన హామీలను తుంగలో తొక్కిందని, వాటిపై రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని తెలిపారు. కార్యక్రమంలో షేక్ అప్పాసాహెబ్, జి గంగు నాయుడు, ఎస్.జంగారావు, కె సన్యాసి, సిహెచ్. దేముడు, బి నాగేశ్వరరావు, పి అప్పలరాజు, డి శంకర్, కె ఈశ్వరరావు, నాగరాజు, వెంకటేశ్వర్లు దొర పాల్గొన్నారు.



మధురవాడ స్వతంత్ర్యనగర్‌లో..



కె.కోటపాడులో...



ఆనందపురంలో...

రోడ్ల విస్తరణకు వ్యతిరేకం కాదు



అభిప్రాయాన్ని ప్లకార్డులతో వ్యక్తం చేస్తున్న వ్యాపారులు

ప్రజాశక- నర్సీపట్నం టౌన్ : దుకాణాలు, వ్యాపార సముదాయాలు, జనావాసాలకు వాటిల్లుతున్న నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని నర్సీపట్నంలో రోడ్ల విస్తరణ వెడల్పును వంద అడుగుల నుంచి 80 అడుగులకు తగ్గించాలని కోరుతున్నామే తప్ప, తాము రోడ్ల విస్తరణకు వ్యతిరేకం కాదని స్థానిక వ్యాపారులు స్పష్టం చేశారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల విస్తరణ వల్ల భవనాలను, దుకాణాలను కోల్పోతున్న వారి దుస్థితిని గమనించి తగు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అంతేకాకుండా నోటీసులు అందుకున్న 15 రోజుల్లో దుకాణాలు ఖాళీ చేయమంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దీనిపై బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు గతనెలలోనే ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. రోడ్ల విస్తరణను 80 అడుగులకు చేయాలని, పరిహారం కింద టిడిఆర్ బాండ్లకు బదులు నగదు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. నెలరోజులౌతున్నా ఎమ్మెల్యే నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో దాని కోసం ఎదురుచూస్తున్నామన్నారు..తామంతా విస్తరణకు వ్యతిరేకం కాదని అది జరిగే తీరును మాత్రమే వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పూర్తిగా బిల్డింగ్ నష్టపోతున్న వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు.

సత్యనారాయణ మృతి తీరని లోటు

ప్రజాశక్తి- నక్కపల్లి : అనకాపల్లికి చెందిన కార్మిక నాయకులు, సిపిఎం సీనియర్ నాయకులు మళ్ల సత్యనారాయణ మరణం పార్టీకి తీరని లోటని ఎపి రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు అన్నారు. రెండు పర్యాయాలు అనకాపల్లి మున్సిపల్ కౌన్సిలర్‌గా ప్రజలకు విశేషమైన సేవలందించారన్నారు. విద్యార్థి దశ నుంచి ఈ ప్రాంత ఉద్యమాలలో కీలకమైన భూమిక పోషించారని, అనేక కార్మిక సంఘాలు ఏర్పాటు చేసి, వాటికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించారన్నారు.

అనకాపల్లి ప్రాంతంలో సిపిఎం విస్తరణ, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మళ్ల సత్యనారాయణ మరణం అతని కుటుంబానికి, కార్మిక ఉద్యమాలకు, పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్ల ఆశయాల సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మళ్ల కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.